



వైద్య విద్యకు గ్రీన్ సిగ్నల్



నిర్మాణం పూర్తి కావస్తున్న జిల్లా వైద్య విద్య కళాశాల భవనం

- ములుగు మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనుమతిచ్చిన నేషనల్ మెడికల్ కమిషన్
- ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లు
- తొలి ఏడాది 50 మెడికల్ సీట్లు
- 59 మంది ప్రొఫెసర్ల కేటాయింపు
- ఔట్‌సోర్సింగ్ పద్ధతిన 32మంది సిబ్బంది నియామకం
- కళాశాల నిర్మాణానికి నిధులు నిల్
- ప్రస్తుతానికి జిల్లా ఆస్పత్రిలో కొనసాగింపు

ములుగు, ఆగస్టు 2: ములుగు వైద్యకళాశాలకు అడ్డంకులు తొలగిపోయాయి. జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) పచ్చజెండా ఊపింది. దీంతో ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎల్ఓపీ(లెటర్ ఆఫ్ పర్మిషన్) జారీ అయిన వెంటనే సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఈఏడాది జూన్ 24న జాతీయ వైద్య మండలి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చి భవనం, సిబ్బంది, మౌలిక సదుపాయాలు లేవంటూ నివేదిక ఇచ్చింది. దీంతో అనుమతి లభించలేదు. దీనిపై రాష్ట్రప్రభుత్వం అప్పీలుకు వెళ్లి ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జిల్లా ఆస్పత్రి భవనాన్ని చూపించడంతోపాటు కేటాయించిన బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను వెల్లడించింది. పదిరోజులక్రితం జరిగిన వర్చువల్ తనిఖీలలో సంతృప్తి వ్యక్తంచేసిన ఎన్ఎంసీ మెడికల్ కళాశాలకు రైట్ చెప్పింది. అయితే గత ప్రభుత్వం కళాశాల నిర్మాణానికి రూ.180కోట్లు మంజూరుచేసినట్లు ప్రకటించగా.. కొత్త ప్రభుత్వంలో ఇంకా విడుదల కాలేదు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న జిల్లా ఆస్పత్రిలో కళాశాలను కొనసాగించనున్నారు. తొలి ఏడాది 50 మెడికల్ సీట్లు ఎన్ఎంసీ కేటాయించింది.

రూ.180 కోట్లతో రెండున్నరేళ్ల క్రితం మంజూరు

రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకో మెడికల్ కళాశాలను ఏర్పాటుచేసే క్రమంలో 2022 మార్చిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ములుగుకు మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. రూ.180కోట్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. రోడ్డుభవనాల శాఖ ఆధ్వర్యంలో భవనాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. 2023 సెప్టెంబరు 28న అప్పటి వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత కొద్దిరోజులకే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటం, ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో నిధుల విడుదలలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. భవనాల కోసం రూ.10ఎకరాల స్థలాన్ని కేటాయించి చుట్టూ ప్రహరి నిర్మించారు.

400 పడకలతో అనుబంధ వైద్యశాల

మెడికల్ కళాశాలకు అనుబంధంగా 400పడకల సామర్థ్యంలో జిల్లా ఆస్పత్రి, రేడియాలజీ హబ్ మంజూరు కాగా 2022 మార్చి 5న శంకుస్థాపన జరిగింది. పదెకరాల విస్తీర్ణంలో రూ.41కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జీప్లస్ 2 పద్ధతిలో మూడు బ్లాకులలో భవనాలను నిర్మిస్తున్నారు. మెడికల్ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో జిల్లా ఆస్పత్రినే వినియో గించుకోనున్నారు. తరగతుల నిర్వహణకు అవసరమైన గదులతోపాటు హాస్టల్, రెండు లైబ్రరీలు, రెండు లెక్చర్ హాల్‌లు, హాస్టల్, వంటశాల, ల్యాబ్, అడ్మిన్ బ్లాక్, ఆట స్థలాలను సిద్ధంచేస్తున్నారు.

59మంది ప్రొఫెసర్ పోస్టులు మంజూరు

మెడికల్ కళాశాలలో బోధన కోసం ప్రభుత్వం ఇటీవల 59 ప్రొఫెసర్ పోస్టులను మంజూరు చేసింది. వీటిలో 14 ప్రొఫెసర్, 20 అసోసియేట్, 25 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులుండగా ఇప్పటివరకు 25మంది విధు ల్లో చేరారు. మిగతా 24పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతి లో భర్తీ చేయనున్నారు. దరఖాస్తులు ఆహ్వానించగా 50 మంది అప్లికేషన్‌లు వచ్చాయి. రెండు వారాల వ్యవధిలో ప్రొఫెసర్లను నియమించనున్నారు. 32బోధ నేతర సిబ్బంది నియామకం చివరి దశలో ఉంది. 10 డాటా ఎంట్రీ ఆపరేటర్, 8 ఆఫీసు సబార్డినేట్, 4 రిసెప్షన్ హాల్ అటెండెన్స్, 2 రికా ర్డు అసిస్టెంట్, 4 ల్యాబ్ టెక్నీషియన్, 4 థియే టర్ అసిస్టెంట్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నారు.

మొత్తం 433మంది సిబ్బంది సేవలు అవసరం కాగా, రాబోయే రోజుల్లో పెద్దసంఖ్యలో నియామకాలు జరగనున్నాయి.

అందుబాటులో సూపర్‌స్పెషాలిటీ వైద్యం :

-డాక్టర్ బానోతు మోహన్‌లాల్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్



అత్యధిక ఏజెన్సీ ప్రాంతం ఉన్న ములుగు జిల్లా ప్రజలకు త్వరలోనే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా ఆస్పత్రిలోనే చికిత్స చేయడం జరుగుతుంది. ప్రతీ విభాగానికి స్పెషలిస్టు వైద్యులు 24గంటలు సేవలందిస్తారు. రోగనిర్ధారణ చేసే డయాగ్నో హబ్, బ్లడ్ బ్యాంకులను మరింత విస్తరించే అవకాశం ఉంది. మెడికల్ అసెస్మెంట్ ఆఫ్ రేటింగ్ బోర్డు ఎల్ఓపీ ఇస్తే ఆవెంటనే మెడికల్ కౌన్సిల్ కమిటీ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

మహదేవపూర్ వాసికి తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ అవార్డు



ఫొటోగ్రాఫర్ రాజు

మహదేవపూర్, ఆగస్టు 2 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన వర్ధమాన ఫొటోగ్రాఫర్ పంతకాని రాజు తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమని నిర్వహించిన ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో ఉత్తమ ఛాయాచిత్ర అవార్డు లభించింది. రాజు ఒడిస్సా గిరిజన తెగ బోండా మహిళల జీవన సంస్కృతి సంప్రదాయాలపై తీసిన ఫొటోకుగాను ఈ అవార్డు అందుకున్నారు. దేశంలోని 125 మంది ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ కళాకారులు తీసిన600 ఛాయాచిత్రాలు పోటీలో ఉండగా రాజు తీసిన ఫొటోకు అవార్డు రావడం విశేషం. ఈ నెల 19న ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాజు జాతీయ స్థాయి అవార్డు అందుకోనున్నారు.



రాజు తీసిన ఛాయాచిత్రం

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

ఇండస్ట్రియల్‌పార్క్, జిల్లా జనరల్ ఆస్పత్రిలో పలు ప్రారంభోత్సవాలు



మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌రావుకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్/గణపురం, ఆగస్టు 2: నేడు జిల్లాలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శ్రీధర్‌బాబు, సీతక్క పర్యటనకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గణపురం మండలం మైలారం శివారులో 60 ఎకరాల్లో ఏర్పాటు చేయ నున్న ఇండస్ట్రియల్ పార్క్‌తో పాటు పలు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. దీంతో పాటు జిల్లా జనరల్ ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న సేవలు, కల్పిం చాల్సిన వసతులపై సమీక్ష నిర్వహిస్తారు. జిల్లా సమగ్ర అభివృద్ధి , ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై కలెక్టరేట్‌లో మంత్రులు సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రూ. 3.6 కోట్లతో నిర్మించిన సెంట్రల్ డ్రగ్ స్టోర్, రూ. 27లక్షలతో నిర్మించి డాక్టర్ల క్యాంటీన్‌లను మంత్రులు ప్రారంభిస్తారు. సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా సమగ్ర అభివృద్ధిపై జిల్లా అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించనున్నారు. గణపురం వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నయ చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. వాహనాలకు సంబంధించిన పార్కింగ్ స్థలం ఏర్పాటు సైన్ బోర్డులను పరిశీలించారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

3.30లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 2 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీకి ఎగువన వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో బ్యారేజీకి వచ్చే ఇన్‌ఫ్లో పెరుగుతూ, తగ్గుతూ వస్తుంది. శుక్రవారం బ్యారేజీలోకి 3.30లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 4.60మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది. అన్నారం బ్యారేజీకి వచ్చే వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. బ్యారేజీలోకి 6వేల క్యూసెక్కుల

సింగరేణిని కాపాడుకోవాలి..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య



సభలో ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

కాకతీయఖని, ఆగస్టు 2: తెలంగాణకు బతుకుండాలంటే సింగరేణి ప్రైవేటుపరం కాకుండా రక్షించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర శుక్రవారం భూపాలపల్లి ఏరియాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏరియాలోని పలు గనులలో పర్యటించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బొగ్గు గనులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోతే జరిగే నష్టాలను వివరించారు. అనంతరం కాకతీయప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అనంతరం భూపాలపల్లి పట్టణంలోని హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా వాటిని సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కోల్ ఇండియా మాదిరిగా పెర్క్స్‌పై పన్నును సింగరేణి భరించాలన్నారు. సింగరే ణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులను నమ్మించి మోసంచేసిందన్నారు. ఎన్నికలకు ముందోమాట, ఎన్నికల తర్వాతోమాట మాట్లాడుతుందన్నారు. గతంలో సింగరేణి బ్లాకులన అమ్ముతుంటే కేసీఆర్ ప్రభుత్వం చూస్తూ ఊరుకుందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయకుండా కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇచ్చి చూస్తుందన్నారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటు పరం విషయంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ తీరు ఒకేలా ఉందన్నారు. బొగ్గు బావులు ప్రైవేటుపరం అయితే కార్మికుల కు కొలువులు పోతాయని, వారి పిల్లలకు ఉద్యోగాలు రావ న్నారు. బొగ్గు గనుల్లోకి ప్రైవేటు వ్యక్తులు రావొద్దని బోర్డులు పెట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. సింగరేణి పరిరక్షణకు కార్మికులు, వారి కటుంబాలు, కార్మిక సంఘాలు ఏక తాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో సింగ రేణి అధికారులు కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్, భాస్కర్, ఆశయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన పర్వతగిరి ఎస్సై

◆ స్టేషన్ బెయిల్ మంజూరుకు రూ.70వేల డిమాండ్ ◆ రూ.40వేలు తీసుకుంటూ దొరికిన వైనం



ఏసీబీకి పట్టుబడిన డ్రైవర్, ఎస్సై

పర్వతగిరి, ఆగస్టు 2: ఓ కేసులోని నిందితులకు స్టేషన్‌బెయిల్ మంజూరుకు లంచం తీసుకుంటూ వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై గుగులోత్ వెంకన్న ఏసీబీ అధికారులకు శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం. పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ మీదుగా గత నెల 27 రాత్రి ఓ ట్రాలీ ఆటోలో నల్లబెల్లం, పటిక తరలిస్తుండగా.. ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో పెట్రోలింగ్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. వాటిని తరలిస్తున్న సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన బెల్లం వ్యాపారి బాదావత్ భాస్కర్, డ్రైవర్ రాజేష్, వర్కర్ రవిపై కేసు నమోదు చేశారు. అయితే వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపకుండా, 35 క్లాజ్ (బీ) బీఎన్ఎస్ యాక్ట్ కింద నోటీసులు ఇవ్వకుండా వారిని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పించుకున్నాడు. ఈ క్రమంలో అజ్మీరా వెంకట్ అనే వ్యక్తి ద్వారా విషయం గురించి బాధితులు ఆరా తీయగా రూ.70వేలు ఇస్తే స్టేషన్ బెయిల్ ఇస్తానని, లేదంటే వారిని జైలుకు పంపుతానని ఎస్సై స్పష్టం చేశారు. అయితే తమ వద్ద ప్రస్తుతం అంత డబ్బు లేదని చెప్పడంతో రూ.20 వేలను ఓ ప్రైవేటు వ్యక్తి ద్వారా ఎస్ఐ ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. మిగతా రూ.50వేలు కూడా ఇస్తేనే నోటీసులు ఇస్తానని, లేకపోతే జైలుకు పంపిస్తానని హెచ్చరిండంతో బాధితుడు బాదావత్ భాస్కర్ ఏసీబీ కార్యాలయంలో అధికారులను సంప్రదించాడు. దీంతో శుక్రవారం అధికారులు పథకం ప్రకారం రూ.40వేలు ఇస్తామని నిందితుడు భాస్కర్ ద్వారా ఎస్సైకి ఫోన్ చేయగా, ఆయన తన డ్రైవర్ సదానందానికి ఇవ్వాలని సూచించాడు. ఎస్సై చెప్పినట్టు డ్రైవర్‌కు డబ్బులు ఇవ్వగా అతడు వాటిని తీసుకుని ఎస్ఐ ఆఫీసుకు వెళ్లగా, ఏసీబీ అధికారులు పథకం ప్రకారం దాడి చేసి డ్రైవర్ సదానంతోపాటు, ఎస్సై వెంకన్నను అదుపులోకి తీసుకున్నారు. వీరిని శనివారం వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎవరైనా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1064 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు ఎల్.రాజు, ఎస్.రాజు, శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.





స్కూటీతో ఢీకొట్టిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

వరంగల్ క్రైం, ఆగస్టు 2: తన తండ్రి సిలువేరు వీరస్వామిని స్కూటీ అతి వేగంగా నడుపుకుంటూ వచ్చి ఢీకొట్టిన ఎం.భరత్‌పై చర్య తీసుకుని న్యాయం చేయాలని సిలువేరు పున్నం శుక్రవారం హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూలీపని చేసే తన తండ్రి గత నెల 24న గ్రామంలో ఒకరి ఇంటివద్ద పని చేస్తుండగా వేగంగా వచ్చిన భరత్ ఢీకొట్టడంతో కాలుకు తీవ్ర గాయమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నామని, తీవ్ర గాయం కావడంతో కాలు తొలగించే పరిస్థితి వచ్చిందని తెలిపారు. తన తండ్రిని ఢీకొట్టిన భరత్‌పై చర్య తీసుకుని న్యాయం చేయాలని పున్నం కోరారు.



గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు


వరంగల్ క్రైం, ఆగస్టు 2: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఓఆర్ఆర్‌పై పెట్రోలింగ్ చేస్తుండగా టోల్ ప్లాజా వద్ద ముగ్గురు యువకులు కారులో గంజాయి సేవిస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించిన యువకులు పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని ప్రశ్నించగా గంజాయి కలిగి ఉన్నట్లు గుర్తించారు. పి.కృష్ణారెడ్డి, సాయిపవన్, పి.అరవింద్ అనే ముగ్గురు యువకులను అరెస్టు చేసి కారు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఎస్ఐ రవిందర్ ధృవీకరించారు.

● ఐనవోలు : ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కొండపర్తి గ్రామానికి చెందిన బుంగ కల్యాణ్ ఆటోలో వచ్చి పోలీసులను చూసి పరిగెత్తే ప్రయత్నం చేశాడు. ఆటోను తనిఖీ చేయగా ఒక ప్లాస్టిక్ కవర్‌లో 100 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.2,500 వరకు ఉంటుంది. ఆటోతోపాటు సెల్‌ఫోన్, గంజాయిని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.





హనుమకొండలోని ఓఆర్ఆర్‌పై పట్టుబడిన ముగ్గురు యువకులు















అమెరికా రోడ్డు ప్రమాదంలో గుండ్రాతిమడుగువాసి మృతి

స్వగ్రామంలో రోహిత్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి



రోహిత్‌రెడ్డి (ఫైల్)

కురవి, ఆగస్టు 2: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన బండి రోహిత్‌రెడ్డి(27) అమెరికాలోని టెక్సాస్‌లో జూలై 24న మృతి చెందాడు. ఏప్రిల్ 27న టెక్సాస్‌లో తన స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రోహిత్‌రెడ్డి తలకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లాడు. చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతదేహాన్ని శుక్రవారం ఉదయం విమానంలో హైదరాబాద్‌కు తీసుకురాగా, స్వగ్రామమైన గుండ్రాతిమడుగుకు మధ్యాహ్నం తీసుకువచ్చారు. రెండు గంటలకు రోహిత్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, బండి అనిల్‌రెడ్డి-అనితారెడ్డి దంపతులకు రోహిత్‌రెడ్డి, రోహన్‌రెడ్డి కుమారులు. పెద్ద కుమారుడు రోహిత్‌రెడ్డి కాగా, అవివాహితుడు. ఇద్దరు అన్నదమ్ములు ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. కుమారుడి మృతదేహం చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. అంత్యక్రియల్లో జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, భరద్వాజ్ రెడ్డి, బండి అజయ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

వరంగల్ క్రైం, ఆగస్టు 2: తన భర్త, అత్త కనిపించడం లేదని హసన్‌పర్తికి చెందిన పి.సాయిశివాని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 17న తనతో భర్త మణిదీప్, అత్త గొడవపడి పుట్టింటికి వెళ్లగొట్టినట్లు తెలిపారు. తిరిగి తల్లిదండ్రులతో 22వ తేదీన రాగా, భర్త, అత్త ఇంట్లో లేరని, ఇంటికి తాళం వేసి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్‌లో ఉన్నాయని, బంధువులు, తెలిసిన వారి ఇళ్లకు తిరిగినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు.

తాండేమా బోరాయి తీజ్

- ప్రకృతి పరవశించే సంప్రదాయ ఉత్సవం
- నేటి నుంచి 11 వరకు వేడుకలు
- తొమ్మిది రోజులు తండాల్లో సందడే సందడి
- ఆటపాటలతో గిరిజనుల్లో జోష్
- ఒకేసారి నిర్వహించుకోవాలని గిరిజనుల యోచన
- తీజ్ పండుగకు గుర్తింపు ఇవ్వాలని బంజారాల డిమాండ్



తీజ్ బుట్టలను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న గిరిజన మహిళలు (ఫైల్)

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2: గోర్ బంజారాలు సంస్కృతి, సంప్రదాయబద్ధంగా.. ప్రకృతి పరవశించే విధంగా ఏడుగురు కుల దేవతల్లో ఒకరైన మేరామాయాడిని స్మరిస్తూ మేరమా మాత అనుగ్రహంతో జన్మించిన సేవాలాల్ మహారాజ్‌ను మనసారా కొలిచి వేడుకలు నిర్వహిస్తారు. పాడిపంటలు, పిల్లపాప, పశువులు చల్లాగా ఉండేలా దీవించాలని లంబాడ గిరిజనులు భక్తిశ్రద్ధల నడుమ గోధుమ నారుపోసి, గడ్డి బతుకమ్మతో తీజ్ పండుగను జరుపుకుంటారు. ఏటా శ్రావణ మాసంలో తొమ్మిది రోజుల పాటు వారి వెసులుబాటును బట్టి ఉత్సవాలు నిర్వహిస్తారు. పూర్వకాలంలో నిరక్షరాస్యులైన గిరిజనులు వ్యవసాయ సీజన్‌ను అంచనా వేయడానికి వర్షాకాల ఆరంభం అనంతరం వరినాట్లు పూర్తిచేసుకొని తీరిక సమయాల్లో తీజ్ పండుగకు సన్నద్ధమవుతారు. ఈ ఆచార సంప్రదాయ పండుగలు నేటికి కొనసాగుతూ వస్తున్నాయి. ఇక ఈ ఏడాది శనివారం నుంచి ప్రారంభం కానున్న వేడుకలు 11 వరకు తొమ్మిది రోజులపాటు కొనసాగనున్నాయి. ఒకేసారి ఈపండుగను నిర్వహించుకోవాలని గిరిజనులు యోచిస్తున్నారు. తీజ్ పండుగను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి సెలవుదినంగా ప్రకటించాలని గిరిజనులు కోరుతున్నారు.

తీజ్ నేపథ్యం ఇదీ..

గోర్ బంజారాలు శ్రీసేవాలాల్ మహారాజ్, దండి మేరామ మాతను దైవ దూతలుగా కొలుస్తారు. తండాల్లోని పెళ్లి కాని అమ్మాయిలు తమ తల్లిదండ్రులకు పంటలు బాగా పండాలని, అభివృద్ధి చెందాలని భావిజీవితం సవ్యంగ కొనసాగాలని భార్యాభర్తల మధ్య ఉండే ప్రేమానురాగాలు మరింతగా బలపడాలని పార్వతీదేవి శివునిప్రేమ పొందడానికి 107 జన్మలెత్తి 108వ జన్మలో శివున్ని భర్తగా పొందిన రోజు గుర్తుగా ఈ తీజ్ పండుగను నిర్వహిస్తారని ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. ఈ దేవతను కొలుస్తూ కన్నెలు ఎన్నోవిధాలుగా అభ్యరిస్తూ శ్రావణమాసంలో తొమ్మిది రోజుల పాటు ఈ పండుగను నిర్వహిస్తారు. ఉత్తర భారతదేశంలో తీజ్ పండుగను పెళ్లయిన మహిళలు నిర్వహిస్తారు. తమ భర్తల నుంచి ప్రేమానురాగాలు పొందడానికి ఈ పండుగను జరుపుకోవడం విశేషం.



గుండ్లబోడు తండాలో తీజ్ బుట్టపై నీరు పోస్తున్న బాలిక (ఫైల్)

తొమ్మిదో రోజు ఇలా..

తొమ్మిదో రోజును బంజారాలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ తీజ్ ఘనంగా నిర్వహించుకుంటారు. తీజ్ నిమజ్జనానికి బంధు, మిత్రులందరినీ ఆహ్వానిస్తారు. అత్యంత పవిత్రంగా మేరామ మాతను, సేవాలాల్ మహారాజ్‌కు పూజలు చేస్తారు. డప్పుచప్పుళ్లతో గిరిజన సంస్కృతి సంప్రదాయం ప్రకారం పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ తొమ్మిదో రోజు ఘనంగా నిర్వహిస్తారు. ఆడపిల్లలు పెంచిన తీజ్‌ను తండానాయక్ పరిశీలించి ఒక్కొక్క బుట్టను ఆడ పిల్లలకు అందజేస్తారు. తమను ఆపదల నుంచి రక్షించాలని అన్నాదమ్ములకు నారు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు. ఈ గోధుమ నారు అత్యంత పవిత్రమైందని. దీనివల్ల శుభం జరుగుతుందని నమ్మకం. తీజ్ బుట్టలను పట్టుకుని వరసగా నిమజ్జనానికి డప్పుచప్పుల్లతో బయలుదేరుతారు. ఆటా..పాటలు కేరింతలతో ఆనంద భరితంగా ఈ నిమజ్జన వేడుక కొనసాగుతుంది. చెరువు దగ్గర ఈ తీజ్ నిమజ్జనం ఓ అద్భుతమైన సన్నివేశం జరుగుతుంది. తీజ్ తమను వదలివెళ్లి పోతుందనే దుఃఖంతో ఆడపిల్లలు ఏడుస్తుంటే పెద్దలు, సోదరులు వారిని ఊరడిస్తుంటారు. జీవితాంతం నీకు తోడుగా ఉంటూ రక్షిస్తానని చెల్లెల్ని పీటపై నిల్చోపెట్టి కాళ్లను కడిగి సోదరుడు పాదాభివందనం చేస్తాడు. ఆ తర్వాత చెరువులో తీజ్‌ను నిమజ్జనం చేస్తారు.

ఈ ఏడాది తీజ్ పండుగ వివరాలు..

లంబాడ గిరిజనులు ఎంతో భక్తిశ్రద్ధల నడుమ జరుపుకునే తీజ్ పండుగను ఒకేసారి జరుపుకోవాలని గిరిజన పెద్దలు తేదీలు ఖరారు చేశారు. ఈ ఏడాది తొమ్మిది రోజుల పాటు తీజ్ వేడుకలు నిర్వహించుకొని గిరిజనులు ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. తొలి రోజు శనివారం గోధుమలు నానబెట్టడం, ఆదివారం తీజ్ బుట్టలో వేయుట, 5న సోమవారం బోరడి తీజ్, 9న డమోలీ తీజ్, 10న ఘనగోర్ తీజ్, చివరి రోజు 11న నిమజ్జనం చేసేందుకు తేదీలను ప్రకటించారు. వివిధ తండాలకు చెందిన గిరిజనులు ఆయా తేదీల్లో తీజ్ పండుగను జరుపుకోవాలని సూచించారు.



మహబూబాబాద్ శివారు తండాలో తీజ్ బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం (ఫైల్)

తీజ్ పండుగకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి

డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, మహబూబాబాద్



గోర్ బంజార సంస్కృతి కూడా భారతదేశ సంస్కృతిలో అంతర్భాగమే. భారతీయ సంస్కృతులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. తెలుగురాష్ట్రాల్లో లంబాడీ గిరిజనులు మాత్రమే నిర్వహించుకునే తీజ్ పండుగను శనివారం నుంచి 11 వరకు ఒకే కాలంలో నిర్వహించుకొని జాతీ ఐక్యతను చాటుకోవాలి. ప్రభుత్వాలు కూడా 9 రోజులు నిర్వహించే తీజ్ పండుగలో పవిత్రరోజైన ఢమోళీ తీజ్ (7వ రోజు శుక్రవారం) సెలవు ప్రకటిస్తే చివరి మూడురోజులు (ఢమోళీ తీజ్, గణగోర్ తీజ్, కడావ్ తీజ్) ఘనంగా నిర్వహించి తీజ్ పండుగ ప్రాముఖ్యతను భావి తరాలకు అందించడానికి వీలుంటుంది.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

గుగులోతు కిషన్‌నాయక్, గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు మానుకోట



లంబాడ గిరిజనులు ఏటా నిర్వహించుకునే తీజ్ పండుగ గిరిజన సంప్రదాయం, భక్తిభావం, క్రమశిక్షణతో పాటు అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతిరూపంగా నిలుస్తోంది. నిజజీవితంలో ఆడపిల్లలకు కష్టాలు ఎదురైనప్పుడు నీ కష్టాల్లో తోడుగా నేనున్నాని(అన్న) భరోసా, మనోధైర్యం కల్పించే పండుగ తీజ్. ప్రతి ఏటా తీజ్ నిమజ్జనం రోజు చెరువు దగ్గర చెల్లెలిని పీటపై నిల్చోబెట్టి సోదరులు కాళ్లు కడిగి పాదాభివందనం చేస్తారు. ఈ బంధం కలకాలం ఇలాగే ఉండాలని సోదరులను చెల్లెళ్లు ఆశీర్వదించడం ఆనవాయితీగావస్తోంది.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



కాజీపేట, ఆగస్టు 2: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట - పెండ్యాల రైల్వేస్టేషన్‌ల మధ్య గురువారం రాత్రి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయస్సు 30 - 35 సంవత్సరాలలోపు ఉంటుంది. ఎత్తు 5.7 ఛామన ఛాయ రంగు, నలుపు రంగు ప్యాంటు, గులాబీ రంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ నంబర్ 87126 58609 సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



రాజు మృతదేహం

భీమదేవరపల్లి, ఆగస్టు 2: భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు కథనం ప్రకారం.. మల్లారం గ్రామానికి చెందిన దండెం రాజు(27) సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ గ్రామానికి చెందిన రవళితో 8 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లున్నారు. భార్యభర్తల మధ్య తరుచూగా గొడవలు జరుగుతున్నాయి. గత నెల 25న భర్తతో గొడవ పడి రవళి తన పుట్టింటికి వెళ్లింది. రాజు అప్పటి నుంచి తన భార్యను తన ఇంటికి రావాల్సిందిగా పలుమార్లు ఫోన్లు చేశాడు. కానీ రవళి తన పుట్టింటి వద్దనే ఉంటుంది. పిల్లలని చూడాలని ఉందని, కోరినా రవళి స్పందించలేదు. దీంతో నిరాశకు గురైన భర్త రాజు గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు.

కెమిస్ట్రీలో బానోతు రెడ్డికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 2: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బానోతు రెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఏపీలోని మచిలీపట్నంలోని కృష్ణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు డాక్టరేట్ ప్రకటించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ కణాల నిర్మూలకు చేసిన విలువైన పరిశోధనకుగాను డాక్టరేట్ ప్రదానం చేశారు. 'సింథసిస్ ఆఫ్ టెట్రాజోన్ ఫ్యూజ్డ్ ఇమిడాజో ఫిరడిన్స్ అనే అంశంపై కృష్ణ వర్సిటీ కెమిస్ట్రీ విభాగాధిపతి, రెక్టార్ ఎంవీ భసవేశ్వరరావు పర్యవేక్షణలో బానోతు రెడ్డి పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన బానోతు రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బొలగాని రాములు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ముగ్గురు గురుకుల విద్యార్థులకు అస్వస్థత

- ఒకరికి విషపురుగు కుట్టినట్లు నిర్ధారణ
- మరో విద్యార్థి పరిస్థితి విషమం
- బండారుపల్లి తెలంగాణ గురుకులంలో ఘటన



బండారుపల్లిలోని తెలంగాణ బాలుర గురుకులం

ములుగు, ఆగస్టు 2: 12గంటల వ్యవధిలో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ములుగు జిల్లాలోని ములుగు మండలం బండారుపల్లి తెలంగాణ బాలుర గురుకులంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలీవిధంగా ఉన్నాయి. గురువారంరాత్రి నిద్రకు ఉపక్రమించే సమయంలో 8వ తరగతి విద్యార్థి శ్రీకర్ కాళ్లు తిమ్మిరెక్కడంతో ఇబ్బంది పడ్డాడు. ఉపాధ్యాయులు వెంటనే బాలున్ని ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స తర్వాత ఎంజీఎంకు తీసుకువెళ్లారు. విషపురుగు కుట్టినట్లు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం శ్రీకర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఇదేక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున 5గంటలకు వెంకటాపూర్(రామప్ప) మండలం కేశవాపూర్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి ప్రణయ్ కడుపునొప్పితో బాధపడుతుండగా ములుగు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తర్వాత ఉపాధ్యాయులు హనుమకొండ జిల్లా ఆరెపల్లి వద్దగల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ప్రణయ్ కోలుకున్నాడు. ఉదయం8గంటల సమయంలో పాఠశాల మైదానంలో ప్రార్థన జరుగుతుండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి కార్తీక్ స్పృహతప్పి పడిపోయాడు. హుటాహుటిన అతన్ని ఏరియా వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో వెంటనే హనుమకొండకు ఉపాధ్యాయులు తరలించారు. ప్రస్తుతం కార్తీక్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. గంటల వ్యవధిలోనే ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తోటి విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. కాగా, గురుకులంలో చదువుతున్న తమ పిల్లలు ఎలా ఉన్నారోనని తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ఫోన్‌లు చేసి వాకబు చేశారు.

5న గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

హనుమకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని యాకుబ్‌పుర గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 5వ తేదీన తక్షణ(స్పాట్) ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకటేశ్వరరాజు, ప్రిన్సిపాల్ జి.రామ్మోహన్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ-15, బీపీసీ 21, 5 తరగతిలో 6, అలాగే 9వ తరగతిలో 8 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల గిరిజన బాలురు ఉదయం 10గంటలకు వరంగల్‌లోని యాకూబ్‌పుర గిరిజనబాలుర గురుకుల పాఠశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు 9490957296 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

బాలికల పాఠశాలలో..

హనుమకొండ దేవన్నపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2024-25 సంవత్సరానికిగాను 5వ తరగతి, ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరంలో సీట్ల ఖాళీల భర్తీకి ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోరే జ్యోత్స్న తెలిపారు. 5వ తరగతిలో 3 (ఎస్టీ కేటగిరి), ఎంపీసీ మొదటి సంవత్సరంలో 4 సీట్లు (ఎస్టీ కేటగిరి) ఖాళీగా ఉన్నాయని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు, ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటల నుంచి హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తారు. వచ్చే విద్యార్థినులు అన్ని ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీని తీసుకొని రావాలని అన్నారు. వివరాలకు 8919948321 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

8వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్ కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కింద తెలంగాణ నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన వారు, సెమీస్కిల్డ్ కార్మికులకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి సిహెచ్. ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీన ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆబ్రాడ్, జర్మనీ, జపాన్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8125251408, 9100798204లలో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.

స్కూల్ బస్సు దిగబోతూ..

- టైరు కింద పడి ఏడేళ్ల బాలుడి మృతి
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన



సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, పరిశీలిస్తున్న సీఐ

జనగామ కల్చరల్, ఆగస్టు 2: స్కూలు బస్సు దిగబోతూ వెనక టైరు కింద పడి ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఇందుకు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని శాంతింపజేశారు. వివరాల్లోకి వెళితే.. జనగామ మండలం అడవి కేశ్వాపురం గ్రామానికి చెందిన బానోతు గణేష్-మంజుల దంపతుల కుమారుడు వరుణ్(7) జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం యథావిధిగా స్కూలుకు వెళ్లి ఇంటికి వస్తూ బస్సు దిగుతుండగా పుస్తకాల బ్యాగు డోర్‌కు తట్టుకొని వెనుక టైరు కింద పడిపోయాడు. డ్రైవర్ మహేందర్ చూసుకోకుండా బస్సును ముందుకు తీసుకెళ్లడంతో వెనక టైరు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరి కొద్ది నిమిషాల్లో ఇంటికి వస్తాడనుకున్న కొడుకు కళ్లెదుటే విగత జీవిగా పడి ఉండడం చూసి తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. పోలీసులు బస్సును సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

బస్సు అద్దాలు ధ్వంసం..

ఈ ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బంధువులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకొని బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. విద్యార్థి బస్సు దిగకుండానే డ్రైవర్ బస్సు నడపడంతో బాలుడు మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ రఘుపతిరెడ్డి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసులు

125 క్వింటాళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం

వరంగల్ క్రైం, ఆగస్టు 2: జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం సౌరారం గ్రామంలోని రైస్‌మిల్‌లో నిల్వ ఉంచిన రూ.3లక్షల 12వేల విలువ కలిగిన పీడీఎస్ రైస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిసర గ్రామాల్లో సేకరించిన పీడీఎస్ రైస్‌ను డి.రమేశ్ అనే వ్యక్తి రైస్‌మిల్‌లో నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శరత్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు చేశారు. రైస్‌ను స్వాధీనం చేసుకుని రమేశ్‌ను అదుపులోకితీసుకుని విచారణనిమిత్తం జఫర్‌గడ్ పోలీసులకు అప్పగించారు.

కోత యంత్రం తగిలి వ్యక్తి మృతి

చెట్టు కొమ్మల/ కోస్తుండగా ప్రమాదం

చిట్యాల, ఆగస్టు 2: కోత యంత్రం సహాయంతో చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదవశత్తు వ్యక్తికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గోపాలపరం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాదువెల్లి పైడయ్య(55) సొంతంగా కోత యంత్రం కొనుగోలు చేసి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చెట్లు కోసేందుకు కూలీకి వెళ్తుంటాడు. కాగా గ్రామంలోని ఓవ్యక్తి ఇంటి వద్ద చెట్టు కొమ్మను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రం పైడయ్య ఛాతికి తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడని తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నాడు.

అగ్నిమాపక శాఖలో జిల్లాలకు ఫైర్‌మన్‌ల కేటాయింపు

మట్టెవాడ, ఆగస్టు 2: అగ్నిమాపక శాఖలో కొత్తగా చేరి హైదరాబాద్‌లోని అగ్నిమాపక శాఖ శిక్షణ కేంద్రంలో నాలుగు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఫైర్‌మెన్‌లకు వివిధ జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు 51 మంది ఫైర్‌మెన్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారికి వివిధ జిల్లాల్లో రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీసీ పోస్టింగ్ ఇచ్చారు. వరంగల్ జిల్లాకు 18 మంది, హనుమకొండ జిల్లాకు 10 మంది, జనగామ జిల్లాకు 10, మహబూబాబాద్ జిల్లాకు ఇద్దరు, ములుగు జిల్లాకు ఆరుగురు, భూపాలపల్లి జిల్లాకు 5 మంది ఫైర్‌మెన్‌లను కేటాయించారు.

ఉపాధ్యాయుడికి వెంకయ్యనాయుడి ప్రశంస

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 2: హనుమకొండ బ్రాహ్మణవాడలో నివాసముంటున్న హనుమాండ్ల జనార్దన్‌ను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రశంసించారు. రెండు రోజుల క్రితం దుగ్గొండి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి హిందీ ఉపాధ్యాయుడిగా ఆయన ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఉపాధ్యాయ దంపతులను పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు కలిసి ఎడ్లబండిపై గ్రామంలో ఊరేగించడం, అడుగడుగునా వారిపై పూలవర్షం కురిపించడం ఆ గురువు పట్ల అద్భుతభక్తి ప్రదర్శించిన తీరు సోషల్ మీడియాలో వైరల్ అయింది. అది ఏకంగా వెంకయ్య నాయుడు దృష్టికి కూడా పోయింది. ఈ క్రమంలో ఆయన తన ట్విట్టర్‌లో ఆ ఉపాధ్యాయుడిని ప్రత్యేకంగా ప్రశంసించడం చర్చనీయాంశంగా మారింది.

మానవరహిత సబ్‌స్టేషన్లుగా రూపాంతరం

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 2: మొదటి దశగా కార్పొరేషన్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లను మానవరహిత సబ్‌స్టేషన్లుగా రూపాంతం చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఎస్ఈ, డీఈ, నోడల్ ఆఫీసర్లతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. విద్యుత్ అంతరాయాలను కనిష్ఠ స్థాయికి తీసుకరావాలన్నారు. షెడ్యూల్ మెయింటెనెన్స్ అంత యాప్‌లో పొందపర్చాలన్నారు. కార్పొరేషన్ సబ్‌స్టేషన్ల తర్వాత మున్సిపాలిటీల్లో మానవరహిత సబ్‌స్టేషన్లను సిద్ధం చేస్తామన్నారు. ఫీడర్లకు ప్రత్యామ్నాయసరఫరా, రింగ్‌మైన్‌ల ఏర్పాటు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించడానికి కంకణబద్దులై పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు రాహుల్‌శర్మ, టీఎస్ దివాకర

భూపాలపల్లి కలెక్టరేట్/ ములుగు కలెక్టరేట్, ఆగస్టు 2: ఈనెల 5వ నుంచి 9 వరకు జరుగనున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయాలని భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు రాహుల్‌శర్మ, టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయా కలెక్టరేట్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు, అన్ని శాఖల అధికారులతో మాట్లాడిన కలెక్టర్లు స్వచ్ఛదనం, పచ్చదనంపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో స్వచ్ఛదనం, పచ్చదనంపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఈ నెల 5న స్వచ్ఛదనం, పచ్చదనంపై జిల్లా వ్యాప్తంగా ప్రజలతో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్త ద్వారా వర్మీ కంపోస్టు ఎరువులు తయారుచేయడంతో పాటు మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి మంజూరు చేయాలన్నారు. 6వతేదిన తాగునీటి ట్యాంకుల్లో కోర్లినేషన్ చేయాలన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ములుగు కలెక్టర్ దివాకర

కోర్లినేషన్ కిట్లను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు ఇంకుడు గుంతలు లేని ఇళ్లను గుర్తించి ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 7న డ్రైనేజీలను పూడికతీయాలని తెలిపారు. ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను చేపట్టడంతో పాటు రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి వేయాలన్నారు. 8న వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నీరు భూపాలపల్లి ములుగు మునిసిపాలిటీ పరిధిలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను వినియోగంలోకి తేవాలని మునిసి పాలిటీ కమిషనర్ రాజేశ్వర్‌రా వును ఆదేశించారు. ఈనెల 9వ తేదిన ప్రతి మంగళ, శుక్రవారాలను డ్రైడేలు గా పాటించుటకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో శిథిలావస్థల్లో ఉన్న భవనాలను గుర్తించి తొలగించాలన్నారు. ఈకార్యక్ర మంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరావు, డిఎంహెచ్ఓ మధుసూదన్, డిఆర్డీఓ నరేష్, ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, మండల ప్రత్యేక అధికారులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీసీఎస్‌వో రాంపతి, డీసీవో సర్దార్‌సింగ్, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనిన, డీఎంహెచ్‌వో అప్పయ్య, జడ్పీ సీఈవో, డీపీవో, ఏపీడీ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో అందరూ భాగస్వాములవ్వాలి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 2: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవించే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం ములుగులోని కలెక్టరేట్ సమావేశపుహాల్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మహిళా, శిశు సంక్షేమశాఖ, వైద్యఆరోగ్యశాఖలు సమన్వయంతో తల్లిపాలతో తల్లులు, పిల్లలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, జిల్లాసంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అల్లెం అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, సీడీపీవోలు శిరీష, ప్రేమలత, ముత్తమ్మ, సూపర్‌వైజర్లు, ప్రాజెక్టుస్థాయి కోఆర్డినేటర్లు వెంకటరాజు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనతో అభివృద్ధిలో మరింత వేగం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 2: భూపాలపల్లి జిల్లాలో ఒకేసారి ముగ్గురు మంత్రుల పర్యటన ఉందని, దీంతో జిల్లా మరింత అభివృద్ధి పథంలో సాగనుందని రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకంల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం మొదటిసారి జిల్లాకు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దనసరి అనసూయ (సీతక్క)లు వస్తున్నారన్నారు. వీరి పర్యటన దృష్ట్యా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, వివిధ విభాగాల కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 7 నెలల్లోనే నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అంకుతితంగా కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలోనాయకులు గాజర్ల అశోక్, చల్లూరి మధు, అప్పం కిషన్, ఇస్లావత్ దేవన్, పిప్పాల రాజేందర్, కొమురయ్య పాల్గొన్నారు.

సారాపై సంయుక్త దాడులు..!

కృష్ణకాలనీ (భూపాలపల్లి)/కాటారం, ఆగస్టు 2: సారాపై పోలీస్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తదాడులు చేశారు. భూపాలపల్లి జిల్లా ఎస్పీకిరణ్ ఖరే ఆదేశాలతో భూపాలపల్లి, కాటారం సబ్ డివిజన్ పోలీస్, ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగి ఆయా ప్రాంతాల్లోని గుడుంబా స్థావరాలపై ఏకకాలంలో ఆకస్మీకంగా శుక్రవారం రైడ్ చేశారు. భూపాలపల్లి సబ్ డివిజన్ల 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే,1620 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని ఏడుగుపై కేసు నమోదు చేశారు. ఇక కాటారం సబ్ డివిజన్‌లో 33 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని 1200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 10 మందిపై కేసులు నమోదు చేశారు. భూపాలపల్లి మండలంలోని పెద్దకుంటపల్లిలో జరిగిన ఈ దాడుల్లో భూపాలపల్లి సీఐ నరేష్‌కు మార్, ఎస్సై ప్రసాద్, డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, ఎక్సైజ్ ఎస్సై రబ్బాని పాల్గొనగా కాటారం సబ్ డివిజన్ పరిధిలో కాటారం నాగార్జునరావు, ఆయా ఠాణాల ఎస్సైలు, ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దకుంటపల్లిలో దాడుల అనంతరం గ్రామంలో అవగాహన కల్పిస్తున్న పోలీస్, ఎక్సైజ్ అధికారులు

ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో సంబరాలు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 2: ఎస్సీవర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల ములుగులో మహాజన సోషలిస్టుపార్టీ(ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ములుగులోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించడంతోపాటు బాణాసం చా కాల్చి మిఠాయి పంచుకున్నారు. అదేవిధంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈకార్య క్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ఇనుముల రామస్వా మి, చంటి భద్రయ్య, మరాతి రవీందర్, కాడపాక శ్యామ్, బోడ రఘు, దూడపాక రాజు, కడారి సాంబయ్య పాల్గొన్నారు.



ములుగులో నినాదాలు చేస్తున్న ఎంఎస్పీ నాయకులు

పలు గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలు

కాటారం, ఆగస్టు 2:స్థానిక పీహెచ్‌సీ పరిధిలోగల సబ్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం పలు గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలు చేపట్టారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఇంటింటా తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహించారు. ధన్వాడ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్లు మౌనిక, వందన, గీత, తిరుపతిరెడ్డి, సీహెచ్‌వో నిర్మల, హెచ్ఎస్ సరళ, హెచ్‌ఏ సమ్మయ్య, రజిత తదితరులు ఉన్నారు.

పరిహారం చెల్లించకుంటే పెద్ద ఆందోళనలు

మల్హర్, ఆగష్టు 2 : జెన్ భూ ఉపరితల బొగ్గు గనుల తవ్వకాల్లో భాగంగా పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలోని ఇళ్లు, మిగులు భూములు సేకరించి పరిహారం చెల్లించాలని లేని పక్షంలో భూ నిర్వాసితుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడ్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం తాడిచర్లలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాస్, తాజా మాజీ ఎంపీటీసీ రావుల కల్పన, భూ నిర్వాసితుల సంఘం నాయకులు అక్కపాక సమ్మయ్య పాల్గొన్నారు.

సర్వే ల్యాండ్స్ రికార్డ్ ఏడీ బాధ్యతల స్వీకరణ

భూపాలపల్లి కలెక్టరేట్ ఆగస్టు 2: జిల్లా సర్వే ల్యాండ్ ఏడిగా బాధ్యతలు కుసుమ కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కుసుమ కుమారి కలెక్టర్ రాహుల్‌శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బదిలీల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భూపాలపల్లి జిల్లాకు బదిలీపై కుసుమ కుమారి ఏడిగా వచ్చారు.

బీజేపీ జెండా ఎగురవేయాలి

మొగుళ్లపల్లి, ఆగస్టు 2: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని బీజేపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు నాగపురి రాజమౌళిగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రెడ్డి, నాయకులు పోలసాని తిరుపతిరావు, ప్రభారి, కుమ్మరి సారయ్య, మోరె వేణుగోపాలరెడ్డి, లోకులబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు

గోవిందరావుపేట, ఆగస్టు 2: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పస్రా పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు మోహన్‌రాథోడ్ మాట్లాడారు. చేసిన పనులకు బిల్లులు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

● వాజేడు : అసెంబ్లీ ముట్టడి వెళుతున్నారనే ఇంటెలిజెన్స్ సమా చారంతో పోలీసులు మాజీ సర్పంచులను ముందస్తు అరెస్టులు చేసి వాజేడు, పేరూరు స్టేషన్‌లకు తరలించారు. మండలంలోని గొల్లగు డెం, చింతూరు, టేకులగుడెం, గుమ్మడిదొడ్డి, కృష్ణాపురం, పూసూరు, తదితర జీపీ బీఆర్ఎస్ సర్పంచులను అర్ధరాత్రి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 2: పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందించడం ఎంతో శ్రేయస్కరమని భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని 16వ వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం 16వ వార్డు రాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలోని నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భూపాలపల్లి సీడీపీవో అవంతితో కలిసి పాల్గొన్నారు. హనుమాన్‌నగర్ అంగన్ వాడీ సెంటర్‌లోసైతం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహి ంచారు. సూపర్వైజర్లు రాజేశ్వరి, అరుణ, అంగన్‌వాడీ టీచర్లు ఉమామహేశ్వరి, అరుణ, బండారి పుష్పలత పాల్గొన్నారు.



హనుమాన్‌నగర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

●మొగుళ్లపల్లి : చిన్నారులకు తల్లిపాలే శ్రేయస్కరమని, పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెన్నెల, రజిత, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

● కాటారం : మండలంలోని అల్లీపూర్, ధన్వాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, కిషోర బాలికలు, మహిళలు, ఉపాధ్యాయులతో కలిసి అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ చేపట్టారు. ఏడబ్ల్యూటీలు శ్రీలతారెడ్డి, శ్రీలత, రజిత ఆయాలున్నారు.

మెగా జాబ్ క్యాలెండర్ ప్రకటన చేయాలి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 2: సీఎం రేవంత్‌రెడ్డి మెగా జాబ్ క్యాలెండర్ ప్రకటన చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ములుగులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల సమస్యపై మాట్లాడి మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మెరుగు కృష్ణమూర్తి, భానుప్రసాద్, చాతరాజు విక్రాంత్, తదితరులు పాల్గొన్నారు.

'పొలం బాట'లో విద్యుత్ అధికారులు

కాటారం, ఆగస్టు 2:విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టేలా అధికారులు 'పొలంబాట'లో పాల్గొన్నారు. మండలంలోని గంగారం, గట్లకుంట గ్రామాల పరిధిలో విద్యుత్‌శాఖ ఇటీవల వినూత్నంగా నిర్వహిస్తున్న పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. కాటారం ఏడీఈ నాగరాజు, ఏఈ మేఘనాథ్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, లైన్‌మెన్ ప్రవీణ్ రైతులను పొలాల వద్ద కలిసి సమస్యలపై చర్చించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్థంబాలను సరిచేస్తామని తెలిపారు. సిబ్బంది శంకర్, రైతులు ప్రభాకర్, సంపత్‌తో పాటు పలువురు ఉన్నారు.


'స్వచ్ఛదనం-పచ్చదనం'పై సమావేశం

కాటారం, ఆగస్టు 2:మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రభుత్వం ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహించతలపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలస్థాయి అధికారులు, జీపీ ప్రత్యేకాధికారులు, వివిధశాఖల సిబ్బంది, మండలసమాఖ్య ప్రతినిధులు హాజరైన సమావేశంలో ఎంపీడీవో బాబు వివిధ అంశాలపై సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో వీరస్వామి, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, డీటీ రాంమోహన్, ఏవో రామకృష్ణ, ఏఈ రాజశేఖర్, ఏపీవో వెంకన్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఫర్జానా తదితరులున్నారు.

మండలంలో భారీ వర్షం

ఇంటిపై కూలిన చెట్టు

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 2: గురువారం రాత్రి మండలంలో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన జోరు వాన పడడంతో చెట్లు, విద్యుత్తు స్థంబాలు నేలమట్టమ య్యాయి. భారీ వర్షానికి మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన బండారు నర్సింహు లు, బండారి రమే ష్‌ల ఇండ్లపై భారీ వేపచెట్టు పడడంతో తృటిలో ప్రాణపాయం తప్పింది. ఒక్కసారిగా చెట్టు విరిగి ఇండ్లపై పడడంతో ఇంట్లో ఉన్న వారంతా హుటాహుటిన బయటకు వచ్చారు. ఈ ఘటనలో ఇల్లు నేలమట్టం కాగా ఇంట్లో ఖరీదైన వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయని, ప్రభుత్వం రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రాత్రి కురిసిన భారీ వర్షానికి చెట్టు కూలి కిందపడిన ఘటనలో ఇండ్లు ధ్వంసమై ఇంట్లోని వస్తువులు పూర్తిగా దెబ్బతిన్న కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎమ్డీ దావూద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఇంటిపై కూలిన చెట్టు

ఐటీడీఏ పీవో ఆకస్మిక తనిఖీ

మంగపేట, ఆగస్టు 2: మంగపేట ప్రభుత్వ ప్రథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం రాత్రి ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ చిత్ర మిశ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించగా ఫార్మాసిస్ట్‌తో, వైద్య సిబ్బంది గైర్హాజరు అయినట్లు గుర్తించారు. ప్రస్తుత వర్షకాలం సీజన్‌లో వైద్యాధి కారి గైర్హాజరుపై వివరణ చెప్పాల్సిందిగా ఐటీడీఏ జిల్లా డిప్యూటీ అధికారిని పీవో కోరారు. ప్రసవ కేంద్రం పూర్తి కాలేదని, ఆసుపత్రిని సందర్శించి కంపౌడ్‌వాల్ అంచనాలతో పాటు ప్రవేశ ద్వారం, లెవలింగ్ కోసం అంచనాలను సిద్ధం చేయాలని ఏఈ, డిప్యూటీ ఈఈని ఆదేశించారు. తాను తెలిపిన అంశాలపై 24 గంటలలోపు సాధారణ మెమో జారీ చేయాలని ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా ఐటీడీఏ జిల్లా సహాయ వైద్యాధికారికి ఆదేశాలు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వారంలో ఏడు రోజులు రాత్రి షిఫ్టు విధులు ఇక నుంచి నిర్వహించాలని తెలిపారు. హాజరులో పొందుపరచాలని ఆదేశించారు.



పీహెచ్‌సీని ప రిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

పోలీసుల వాహన తనిఖీలు

ములుగు రూరల్, ఆగస్టు 2 : ములుగు మండలం జంగాలపల్లి వద్ద పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాల ధృవ పత్రాలను, క్షున్నంగా పరిశీలి ంచారు. అనుమానితులను విచారించి వదిలేశారు. ద్విచక్ర వాహనాలు నడుపుతూ హెల్మెట్ ధరించని వారిని ఆపి ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ద్విచక్రవాహనం నడిపేవారు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనం నడిపేవారు తప్పనిసరిగ సీటు బెల్టు ధరించడం వల్ల ప్రమాదాలను కొంత మేరకు నివారించవచ్చని ఎస్సై వెంకటేశ్వర్‌రావు వివరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

వాజేడు, ఆగస్టు 2: మండలంలోని ఐటీఐలో రెండో విడతలో మిగిలిన సీట్లను మూడో విడతలో భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ, 10వ తరగతి పాసైన విద్యార్థులు ఐటీఐ చేరేందుకు అర్హులన్నారు. ఎలక్ట్రీషియన్‌లో 9 సీట్లు, ఫిట్టర్‌లో 17, ఎలక్ట్రానిక్ మెకానిక్‌లో 24, డ్రాఫ్ట్‌మెన్ సివిల్‌లో 23, కోపాలో 45 సీ ట్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని, వాజేడు పరిసర ప్రాంత విద్యార్థులు వెబ్ ఆప్షన్‌లో వాజేడు ఐటీఐని మొదటి ఆప్షన్‌గా పెట్టుకోవాలన్నారు. వివరాల కోరకు వాజేడు ఐటీఐలో సంప్రదించాలన్నారు.

కాటారం ఐటీఐలో..

కాటారం : కాటారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో 2024-2025విద్యా సంవత్సరానికి గానూ మూడో విడత ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిట్టర్ ఎలక్ట్రీషియన్, డీఎం సివిల్, కోపా విభాగాల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయిన తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు దరఖాస్తు చేసుకొని వెబ్‌సైట్‌లో నిజధృవీకరణ పత్రాలు(ఒరిజినల్ సర్టిఫికెట్స్)అప్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 2: మండలంలోని యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని స్థానిక సీఐ బండారి కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, కళాశాల అకడమిక్ ఇన్‌చార్జి అమ్మిన శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసం.. రూ.90వేలు పోగొట్టుకున్న బాధితుడు

మహదేవపూర్, ఆగస్టు 2 :మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన చీర్ల తిరుపతి సైబర్ మోసంలో రూ .90 వేలు మోసపోయాడు. మహదేవపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ పోలీసుల పేరుతో కానిస్టేబుల్ భార్య అనారోగ్య పరిస్థితులతో ఉందని, డబ్బులు పంపించాలని ఆగంతకుడు ఫోన్ చేసి అడిగాడు. దీంతో సదరు మీ సవే నిర్వాహకుడు చీర్ల తిరుపతి అగంతకుడికి డబ్బులు పంపించగా కొంత సమయం తర్వాత ఆరా తీయగా పోలీసులు ఫోన్ చేయలేదని సైబర్ నేరస్థుడు ఫోన్ చేయడంతో మోసపోయానని గ్రహించాడు. దీంతో సైబర్ క్రైంకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. మహదేవపూర్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలి

తాడ్వాయి, ఆగస్టు 2: మండలంలోని గిరిజన యువతకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్ప రవీందర్ కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సంక్షేమభవన్‌లో రాష్ట్ర ట్రైకార్ జనరల్ మేనేజర్ కుంజా శంకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ట్రైకార్, గిరివికాస్, మైక్రో ఇండస్ట్రీ, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లో ఏదో ఒక పథకం మంజూరు చేసి ఉపాధి కల్పించాలని కోరారు.

సీఎం చిత్రపటానికి కళాకారుల క్షీరాభిషేకం

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 2: 30శాతం పీఆర్సీ ప్రకటించిన సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు శుక్రవారం ములుగులోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి సీతక్కల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కళాకారులు మిఠాయి పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు బాదం ప్రవీణ్, కుక్కల నాగరాజు, కళాకారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 2: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ (అలిమ్‌కో), సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీంతో జిల్లాలోని నలుమూల నుంచి వివిధ పరికరాల నిమిత్తం అవసరమున్న దివ్యాంగులు హాజరుకాగా, వారందరికి అలిమ్‌కో సంస్థ వై ద్యబృందం పరీక్షలు చేసి పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ హాజరై మాట్లాడారు. శిబిరంలో మొత్తంగా 39 మంది వినికిడి యంత్రాలు, 20 వంది వీల్‌చైర్లు, 44 మంది ఎమ్మెస్ ఐడీ కిట్లు అవసరమున్నట్లు గుర్తించినట్లు అలిమ్‌కో వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సనిత బృందం, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

కాటారంలో కంటి ఉచిత పరీక్షలు..

కాటారం, ఆగస్టు 2: మండలకేంద్రంలో శుక్రవారం శరత్ మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో జయ ఆప్టికల్స్. ఐ కేర్ సెంటర్ సహకారంతో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కాటారం సీఐ నాగార్జునరావు ప్రారంభించారు. శిబిరంలో 100మందికి పైగా పాల్గొనగా నిర్వాహకులు కంటి పరీక్షలు నిర్వహించారు. కాటారక్ట్ సమస్య ఉన్న వారికి రాయితీపై కంటి ఆపరేషన్లు, ఉచిత రవాణా, భోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఆప్టోమెట్రిస్ట్ లింగమూర్తి, నవీన్ ఉన్నారు.

తపాలాశాఖ పథకాలపై అవగాహన

మొగుళ్లపల్లి, ఆగస్టు 2: తపాలాశాఖ గ్రామీణ ప్రాంత ప్రజల కోసం పలు రకాల పొదుపు సేవింగ్స్ పథకాలు, ఇన్సూరెన్స్ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పరకాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనంతరాంనాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని మేదరమెట్ల గ్రామంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో తపాలా జీవితబీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మొగుళ్లపల్లి ఎస్‌పీఎం మల్లేష్, ఎంవో సంతోష్, బీపీఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి

మహదేవపూర్, ఆగస్టు 2 : మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు శుక్రవారం కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద గోదావరి వరద ప్రవాహం పెరిగింది. గత మూడు రోజుల నుంచి వరద ప్రవాహం మెట్ల కింది నిండి ఉండగా తాజాగా శుక్రవారం సాయంత్రం మెట్లు దాటుకుని వరద ప్రవహిస్తోంది. ప్రాణహిత నది నుంచి పెద్ద ఎత్తున వరద చేరడంతో కాళేశ్వర పుష్కరఘాట్ వద్ద జలకళ సంతరించుకుంది. మళ్లీ గోదావరి ప్రవాహం వేగవంతమైంది. 11.5 మీటర్ల ఎత్తుతో ప్రవాహం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. గోదావరి పెరుగుదలపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

చెట్టును తొలగించిన ఎస్సై

గోవిందరావుపేట, ఆగస్టు 2: మండలంలోని పస్రా చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి కురిసిన వర్షానికి భారీ చెట్టు జాతీయరహదారిపై విరిగిపడింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈవిషయం తెలుసుకున్న పస్రా ఎస్సై కమలాకర్ సిబ్బందితో కలిసి జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు. దీంతో వాహన రాకపోకలు సజావుగా సాగాయి. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు సీఎం క్షమాపణ చెప్పాలి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 2: అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రి, సీనియర్ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, ఆయన వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం ములుగులో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, నాయకులు గండ్రకోట సుధీర్‌యాదవ్, రమేష్, రవీందర్, మాసిపెద్ది సత్యనారాయణ, గడ్డమీది భాస్కర్, సురేందర్ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలాన్ని విరమించుకోవాలి

కాకతీయఖని, ఆగస్టు 2: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని విరమించుకోవాలని ఏఐటీయూసీ భూపాలపల్లి బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ డిమాండ్ చేశారు. ఏరియాలోని కేటీకే-5వ గని ఆవరణలో పిట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌క హాజరై మాట్లాడారు. బొగ్గు గనులు ప్రైవేటు వ్యక్తు చేతుల్లోకి వెళితే సింగరేణి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. గత సంవత్సరపు లాభాల వాటాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అందులో 35శాతం వాటాను పంచాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. సింగరేణి నిధులు విచ్చలవిడిగా ఖర్చు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సొంత ప్రయోజనాలకోసం సింగరేణి సొమ్మును పంచడం మానుకోవాలన్నారు. సివిల్స్ క్వాలిఫైడ్ అభ్యర్థులకు సింగరేణి నిధులను ఖర్చు చేస్తామనడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆసిఫ్‌పాషా, సుధాకర్‌రెడ్డి, రామ్‌చందర్, నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.